# కులగణనతో బీసీలకు ఒరిగేదేమీ లేదు



### టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్

పరిగి, ఫిబ్రవరి 5 : కులగణన కాలయాపనకే తప్ప బీసీలకు ఒరిగేదేమీ లేదని టీజేఏసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన రిపోర్టు కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్లుగా ఉందన్నారు. కుట్రపూరితంగానే బీసీల జనాభాను తగ్గించి చూపడం, ఓసీల జనాభాను పెంచి చూపడం, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్‌తో తక్కువ జనాభా గల వారికి న్యాయం చేస్తూ, అత్యధిక జనాభా గల బీసీలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రాతినిథ్యం ఉండాలని రాజ్యాంగం చెబుతున్నా అవకాశం ఇవ్వని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలపరంగా జనాభా ప్రాతిపదికన ఇస్తామని, ఇతర పార్టీలను ఇవ్వబోమని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బీసీలను మభ్యపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కులగణన రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టినట్లుగా ఉందని, బీసీలకు న్యాయం చేయడానికి అన్నట్లు లేదన్నారు. గతంలో ఇందిరమ్మను వ్యతిరేకించిన ఒకటి రెండు సామాజిక వర్గాలే ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారంతో ప్రజలందరినీ మోసం చేస్తున్నాయన్నారు.

# ఇది.. తలతిక్క సర్వే



### బీఆర్ఎస్ నాయకుడు రాజావరప్రసాదవ్

షాద్‌నగర్, ఫిబ్రవరి 5 : బాధ్యతాయుతంగా చేయాల్సిన కులగణన సర్వేను ఇష్టానుసారంగా చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సైతం అర్థం లేని వాఖ్యలు చేయడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ నాయకుడు, సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ మండిపడ్డారు. తలతిక్క సర్వే చేసి అదే నిజం, వాస్తవం అని చెప్పడంతోపాటు ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఉత్సాహం చూపుతున్నారన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బోగస్ ఓట్లను, దొంగ ఓట్లను చేర్చి, బీసీల సంఖ్యను ఎక్కువగా చూపారని చెప్పడం మీ హోదాకు సరికాదన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన ఎంపీ ఎన్నికల ఓటర్ జాబితాకు, తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన కులగణన వివరాలకు ఎక్కడైన సంబంధం ఉందా ? అని ప్రశ్నించారు. పరిపాలనపై పట్టు లేకుండా, పాలనా వ్యవస్థను గాలికి వదిలేసి, తమ పొరపాట్లను ఎత్తిచూపిన ప్రతిపక్ష పార్టీలపై బురదజల్లడం సరికాదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇష్టానుసారంగా సర్వే చేసి బీసీల సంఖ్యను తగ్గించారని, ప్రభుత్వ పని తీరును బీసీలు స్వాగతించే స్థితిలో లేరనే విషయాన్ని గమనించాలని సూచించారు.

# బిల్లులివ్వడం చేతగాకపోతే చెప్పాలే..

- అక్రమ అరెస్టులు చేసి మానసికంగా వేధిస్తే ఎలా..?
- మీడియా సమావేశంలో మాజీ సర్పంచ్‌ల ఆవేదన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి

కేశంపేట, ఫిబ్రవరి 5 : ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తమకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వడం చేతగాకపోతే చెప్పాలెకానీ చీటికిమాటికి అక్రమంగా అరెస్టులు చేసి మానసికంగా వేధిస్తే ఎలాగని కేశంపేట మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు ప్రశ్నించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాదికాలంగా అసెంబ్లీ సమావేశాలు పెట్టిన ప్రతిసారి మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జడ్పీటీసీ స్థాయి నుంచి సీఎం స్థాయి వరకు ఎదిగానని చెప్పుకొంటారని, అయితే కింది స్థాయి నుంచి వెళ్లిన వ్యక్తిగా తమ బాధలు గుర్తించకపోగా అక్రమంగా అరెస్టులు చేయించి మానసిక వేదనకు గురిచేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్‌లకు నిధులు విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామన్నారు. గ్రామాల ప్రగతి కోసం అనేక అప్పులు చేసి పల్లె ప్రకృతివనం, రైతు వేదికలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతుల వంటి అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రభుత్వం మారాక అసలు బిల్లులు ఇస్తారా? ఇవ్వరా? అనే విషయాన్ని చెప్పకుండా అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే ప్రతిసారి మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించడం, గృహనిర్బంధాలు విధించడం భావ్యంకాదన్నారు. అధికార దర్పాన్ని ప్రదర్శించాలని చూస్తే సహించేదిలేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్రామాల్లో ఎమ్మెల్యేలు తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ఐదేండ్లపాటు ప్రజలకు సేవ చేసిన పాలకులు ప్రభుత్వ వైఖరి కారణంగా నేడు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# కొనసాగుతున్న నిర్బంధకాండ

## రెండో రోజూ పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



కేశంపేట : బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న కేశంపేట పోలీసులు

కేశంపేట, ఫిబ్రవరి 5 : మండలంలోని మాజీ సర్పంచ్‌లను కేశంపేట పోలీసులు బుధవారం రెండో రోజూ అదుపులోకి తీసుకున్నారు. ఉదయమే వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు మాట్లాడారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకుందామనుకుంటే అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తామేమీ నేరాలు చేయలేదని, తమను అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టడమేంటని, ప్రభుత్వానికి చేతనైతే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సవాల్ చేశారు. అరెస్టయినవారిలో అల్వాల మాజీ సర్పంచ్ శ్రీలత, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, నవీన్‌కుమార్, ఆంజనేయులు యాదవ్, జగన్ ఉన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



మొయినాబాద్ : నక్కలపల్లిలో సర్పంచ్ భర్తను నిర్బంధించిన పోలీసు

మొయినాబాద్ : పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం చెల్లించని నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించడానికి పిలుపునిచ్చారు. బుధవారం మాజీ సర్పంచ్‌లు రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించడానికి వెళ్లనివ్వకుండా పోలీసులు వారిని హౌస్ అరెస్టులు, ఎక్కడికక్కడ నిర్బంధించారు. తమది ప్రజా పాలన అని చెప్పుకొంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మాజీ సర్పంచ్‌లు ప్రజల కోసం చేసిన పనుల బిల్లులను ఎందుకు చెల్లించడం లేదని మండిపడ్డారు. ప్రజాపాలనలో ఆందోళనలు, ధర్నాలు, పోలీసుల నిర్బంధకాండ ఏమిటని మాజీ సర్పంచ్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

### బిల్లులు చెల్లించకపోవడం దారుణం

కొందుర్గు : రెండో రోజూ కొందుర్గు పోలీసులు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ గ్రామపంచాయతీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, కానీ తమకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇక అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడల్లా తమను అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అదుపులో శ్రీధర్‌రెడ్డి, గొల్ల శేఖర్, ప్రేమ్ కుమార్, గోపాల్‌నాయక్ ఉన్నారు.



కొందుర్గు : పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్

# బీసీలకు అన్యాయం చేస్తే గుణపాఠం చెబుతాం

- కేసీఆర్ సర్వే చేసినప్పుడు ఎక్కువగా ఉన్న బీసీలు ఇప్పుడేలా తగ్గుతారు..?
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం
- షాబాద్‌లో విలేకరుల సమావేశంలో బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్

షాబాద్, ఫిబ్రవరి 5 : తెలంగాణలో బోగస్ కులగణన పేరుతో బీసీలకు అన్యాయం చేస్తే బీసీలమంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం షాబాద్‌లో బీసీ సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ కులగణన పేరుతో బీసీలకు అన్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన కులగణనలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి చేపట్టిన సర్వేలో బీసీల సంఖ్య ఎలా తక్కువ అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఓసీల సంఖ్య ఎక్కువగా ఉందని చూపించడం ప్రభుత్వానికి తగదని సూచించారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాకా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీసీలంతా పార్టీలను పక్కన పెట్టి తమ హక్కులు, రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల విషయంలో అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలమంతా తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సేన నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, ఆనంద్, మశ్చేందర్, శ్రీకాంత్, శేఖర్, రమేశ్, అబ్బాస్, మహేందర్ తదితరులున్నారు.



# వినియోగదారులకు షాక్!

- అనుమతి ఉన్న అంతస్తులకే రెగ్యులర్ విద్యుత్
- మూడింతలు పెరగనున్న విద్యుత్ చార్జీలు
- గ్రేటర్‌లో సుమారు 10 లక్షల కనెక్షన్లపై ప్రభావం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో విద్యుత్ వినియోగదారులకు టీజీఎస్‌పీడీసీఎల్ పెద్ద ఎత్తున షాక్ ఇవ్వనున్నది. ఒకవైపు చార్జీలు పెంచమని చెబుతూనే మరోవైపు నిబంధనల పేరుతో సరికొత్త మార్గాల్లో వినియోగదారులపై ఆర్థిక భారం పడేలా చేస్తున్నది. ఇప్పటివరకు మున్సిపల్, వాటర్, ప్రాపర్టీ టాక్సులకే ఈ పరిస్థితి ఉండగా.. తాజాగా విద్యుత్ శాఖ కూడా ఈ నిర్ణయాన్ని అమలుచేస్తుండడంతో మిగతావాటితో పోలిస్తే ఈ భారం మోయలేనంతగా ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. గ్రేటర్‌లో 62లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 52 లక్షల వరకు డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. భవన నిర్మాణాల సమయంలో అధికారులు టెంపరరీ కనెక్షన్లు ఇచ్చి నిర్మాణం పూర్తయిన తరవాత వాటిని రెగ్యులరైజ్ చేయడం డిస్కంలో సహజంగా జరుగుతుంది. ఇందుకు సంబంధించి వినియోగదారులు దరఖాస్తు చేసుకోగానే మూడు రోజుల్లో ఏఈ క్షేత్రస్థాయి విచారణ జరిపి టెంపరరీ కనెక్షన్‌ను రెగ్యులరైజ్ చేస్తారు. ఈ ప్రక్రియ కూడా ప్రస్తుతం ఆలస్యంగానే జరుగుతుండగా.. తాజాగా ఎస్పీడీసీఎల్ తీసుకుంటున్న నిర్ణయం వినియోగదారులపై పెద్దఎత్తున ఆర్థిక భారం మోపనున్నది. గ్రేటర్‌లో మూడంతస్తుల నుంచి ముప్పై అంతస్తుల వరకు ఇండ్లు ఉన్నాయి. వీటిలో చాలా వాటికి కొన్ని ఫ్లోర్ల వరకే అనుమతులు ఉన్నాయి. ఇండ్లకు కనెక్షన్లు ఇచ్చే సమయంలో ఆక్యుపెన్సీ విషయాన్ని విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల ఇప్పటికిప్పుడు ఈ భారం వినియోగదారులపై పడుతున్నది. అయితే మున్సిపల్ టాక్సుల భారం కంటే కరెంట్ బిల్లుల భారం మరింత ఎక్కువగా ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. ఆక్యుపెన్సీ లేకుండా ఇచ్చిన కనెక్షన్లకు నోటీసులు ఇచ్చి వాటిని టెంపరరీలోకి మార్చడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎండాకాలం పీక్ స్టేజ్‌కు చేరకముందే వీటన్నింటిని గుర్తించి కచ్చితంగా నోటీసులు ఇవ్వాలని అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి చెప్పినట్లు తెలిసింది. ఈ ప్రభావం గ్రేటర్‌లో సుమారుగా 8 నుంచి పది లక్షల మంది విద్యుత్ వినియోగదారులపై పడనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వీరి కనెక్షన్లు రెగ్యులర్ నుంచి టెంపరరీ కేటగిరీ మారితే యూనిట్ రేట్ పెరుగుతుంది. ప్రస్తుతం యూనిట్ ధర ఐదు రూపాయలు ఉండగా.. టెంపరరీలో యూనిట్ ధర రూ.11పైనే భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఆక్యుపెన్సీ ప్రామాణికంగా కేటగిరీలు మారిస్తే వినియోగదారుల జేబులకు చిల్లులు పడడం ఖాయమని తెలుస్తున్నది.

### సమ్మర్‌లో మరింత ఎక్కువ..

వేసవిలో విద్యుత్ వినియోగం పెరగనున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో సాధారణంగా వచ్చే బిల్లే పెరిగితే కేటగిరీ మార్చి యూనిట్‌కు రెండు నుంచి మూడు రెట్ల చార్జీ చేస్తే వినియోగదారుడి పరిస్థితి ఏంటనేది ప్రశ్న. ఈ కేటగిరీలకు సంబంధించి ఎవరైనా ప్రశ్నించాలనుకున్నా వారికి రెగ్యులరైజ్ చేసుకోమన్న సమాధానమే వస్తుందట. అంతేకాదు.. తమ మీటర్ టెంపరరీ కేటగిరీ నుంచి రెగ్యులరైజ్ చేయమని ఏఈ, డీఈల దగ్గరికి వెళ్తే కార్పొరేట్ ఆఫీస్ వరకు వెళ్లాల్సి వస్తుందని వినియోగదారులు చెబుతున్నారు. తాజాగా డిస్కం తీసుకుంటున్న నిర్ణయంతో పదిలక్షల మంది వినియోగదారులపై ఆర్థికభారం పడడమే కాకుండా వారికి ఈ మూడునెలల పాటు రెగ్యులరైజ్ చేయించుకునేందుకు కూడా అధికారులు, సిబ్బంది సహకరించరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమ్మరంతా తమకు ఉక్కపోతతో పాటు కరెంటు బిల్లుల మోత తప్పదా అంటూ గ్రేటర్‌వాసులు ఆందోళన చెందుతున్నారు.

# పారిశ్రామిక వసతుల కల్పనకు జీసీసీ దోహదం

### ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్



జీసీసీ కాంక్లేవ్-2025లో పాల్గొన్న ఐటీశాఖ రాష్ట్ర కార్యదర్శి జయేశ్ రంజన్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5 : ద్వితీయ శ్రేణి నగరాల్లో ప్రభుత్వపరంగా కావాల్సిన పారిశ్రామిక మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు జీసీసీ(గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు) కాంక్లేవ్ ఎంతగానో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని షెరటాన్ హోటల్‌లో హ్యూమనైజ్, మూవ్ ఇన్ సింక్‌ల సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటైన 'మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాంక్లేవ్-2025'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 280కి పైగా జీసీసీలు ఉన్నాయని, విదేశీ కంపెనీలు తమ జీసీసీలను ఇక్కడ స్థాపించుకోవడం జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కాంక్లేవ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం




జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, ఫిబ్రవరి 5 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్-2025కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో శరీర దారుఢ్యం కలుగుతుందని, చిన్నతనం నుంచే ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతిఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధన ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడల్లో రాణింపుతో దేశానికి ప్రాతినిథ్యం వహించే అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డ్రగ్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, జిల్లా క్రీడా అధికారి వెంకటేశ్వర్‌రావు, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

# డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

### డీఏఆర్‌డీఏ పీడీ శ్రీలత

కందుకూరు, ఫిబ్రవరి 5 : డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా డీఏఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. బుధవారం మండల సమాఖ్య భవనంలో డ్వాక్రా సంఘాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదుగాలని కోరారు. డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంక్ నేదునూరు బ్రాంచివారు రూ.76,500 డొనేట్ చేశారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కవిత, ఏజీఎం డీపీఎం బాల్‌రాజ్, అక్షయమూర్తి, గణేశ్, మైసయ్య, ప్రభాకర్, యాదయ్య, శ్రీహరి, ధనలక్ష్మి, హైమావతి, రాజేశ్వరి, అధ్యక్షురాలు పాల్గొన్నారు.




డ్వాక్రా సంఘం నివేదికను ప్రారంభిస్తున్న శ్రీలత

# విద్యార్థి ఆత్మహత్య..?

- ప్రైవేట్ పాఠశాల భవనంపై నుంచి పడి మృతి
- షాద్‌నగర్‌లో విషాద ఘటన



మృతుడు విద్యార్థి నీరజ్ (ఫైల్)

షాద్‌నగర్, ఫిబ్రవరి 5 : ప్రైవేట్ పాఠశాల భవనంపై నుంచి పడి ఓ విద్యార్థి మృతిచెందిన విషాద ఘటన బుధవారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. బీజేపీ షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ కుమారుడు నీరజ్(15) పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో గల శాస్త్ర అనే ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం వేళలో పాఠశాల భవనంలోని బాల్కనీలో నీరజ్, మరో విద్యార్థి కలిసి మాట్లాడుకుంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయుడు వారిని మందలించారని, దీంతో మనస్తాపం చెంది నీరజ్ పాఠశాల భవనంపై నుంచి కిందికి దూకినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన నీరజ్‌ను హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థి మృతిచెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అందె బాబయ్య, పలువురు బీజేపీ నాయకులు విద్యార్థి తండ్రి హరిభూషణ్‌ను పరామర్శించారు. విద్యార్థి మృతితో మల్లికార్జున కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థి మృతి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. మృతికి కారకుడైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హైడ్రా కూల్చివేతలు

### రహదారులపై అడ్డుగా ఉన్న గోడలను కూల్చేసిన అధికారులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ):నగరంలో పలు చోట్ల బుధవారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా మున్సిపాలిటీల్లో రాకపోకలకు అడ్డుగా ఎన్ఆర్ఐ కాలనీ వారు నిర్మించిన ప్రహరీని తొలగించింది. దమ్మాయిగూడ పోయే ప్రధాన రహదారికి చేరాలంటే గతంలో చుట్టూ తిరిగి మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని, ఇప్పుడు కేవలం వంద మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుందని సీనియర్ సిటిజన్‌కాలనీవాసులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను కూల్చిన చోట వెంటనే రోడ్లు వేస్తామని కాప్రా మున్సిపాలిటీ అధికారులు హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. శంషాబాద్ మండలం రాళ్లగూడ గ్రామం వద్ద ఔటర్‌రింగ్ రోడ్డును చేరేందుకు వీలు లేకుండా రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా సిబ్బంది కూల్చేశారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురిలో ఆర్మీ ఆఫీసర్ల కాలనీకి అడ్డుగా నిర్మించిన 50 మీటర్ల ప్రహరీని హైడ్రా తొలగించింది. ఇదే సర్కిల్ పరిధిలో ఉన్న డిఫెన్స్ కాలనీలో సర్వే నంబర్ 218/1లో ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలం కబ్జా అయిందంటూ హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. దాదాపు 1200 గజాల స్థలాన్ని స్థానిక అసోసియేషన్ పెద్దలు ప్లాట్లుగా చేసి విక్రయించారంటూ.. వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. డిఫెన్స్ కాలనీ నివాసితుల ఫిర్యాదు మేరకు స్థానిక అధికారులతో కలిసి హైడ్రా విచారించగా, స్థలాన్ని ఐదు ప్లాట్లుగా చేసి కొన్నింటిని అమ్మారని, మరికొన్నింటిని వారి ఆధీనంలోనే ఉంచుకున్నట్లు నిర్ధారించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కబ్జాలను తొలగించి ప్రజా అవసరాలకు ఉద్దేశించిన జీహెచ్ఎంసీ సీ ల్యాండ్‌గా పేర్కొంటూ ప్రొటెక్టెడ్ బై హైడ్రా అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.

### ప్రజావాణిలో ఫిర్యాదుతో..

కూకట్‌పల్లి-నిజాంపేట రోడ్డులోని హోలిస్టిక్ ఆస్పత్రి వెనుక ప్రభుత్వ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. అదే స్థలంలో తనకు కేటాయించిన 300 గజాల స్థలం ఉందని, ఓ మాజీ సైనికుడు హైడ్రా ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో 1253 గజాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తేలింది. దీంతో స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని హైడ్రా తొలగించింది. చుట్టుపక్కల కాలనీలకు దారులను మూసేస్తూ కాలనీల చుట్టూ ప్రహరీలు నిర్మిస్తే కూల్చివేత తప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, హౌసింగ్ ఎండీ గౌతం

# అర్హులందరికీ పథకాలు

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 5 : అర్హులైన ప్రతి పేదవాడికి ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు చేపడుతామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విధి విధానాలపై హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.గౌతం, ఇంజనీర్ చైతన్యకుమార్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లకు పలు సూచనలు, సలహాలు చేశారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకంగా ఉండాలని పి.వి.గౌతం అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో భాగంగా 2,57,664 దరఖాస్తులు వచ్చాయని, 2,46479 దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవడం జరిగిందని, సర్వే పనులు పూర్తి దశకు చేరుకున్నాయని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలకు మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా తప్పులు దొర్లినట్లయితే తిరిగి పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.